

కాల్పుల కలకలం - 10లో▸

గ్రేటర్ వరంగల్ పరిధి రెండో డివిజన్ గుండ్లసింగారంలో గురువారం జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది.



హ్యాపీ జర్నీ..

బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రత్యేక బస్ సర్వీస్‌లు ఏర్పాటు చేసి మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు ఆర్టీసీ సర్వం సిద్ధమైంది. - 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0° /24.0°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

గౌస్ హైదర్‌కు అవార్డు



ములుగు రూరల్: దేశంలో ప్రతిష్టాత్మకమైన ఇండియా ఎక్సలెన్స్ అవార్డు జిల్లా వ్యవసాయ అధికారి గౌస్ హైదర్‌కు దక్కింది. కరొక్ సంగీతంలో గౌస్ హైదర్ ఇండియా ఎక్సలెన్స్-2023 అవార్డుకు ఎంపిక కాగా.. శుక్రవారం మాజీ క్రికెటర్ సునిల్ గవాస్కార్ చేతుల మీదుగా ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. ముందుగా రూపొందించిన మ్యూజిక్‌కు అనుగుణంగా అప్పటికప్పుడు పదాలను కూర్చుకొని పాటలు పాడటాన్నే.. కరొక్ సంగీతం అంటారని ఈసందర్భంగా గౌస్ హైదర్ తెలిపారు. కొత్త రకం సంగీతాన్ని సృష్టించి పలువురు కళాకారులకు ఉపాధి కల్పించినందుకు 2022లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో తనకు చోటు దక్కినట్లు హైదర్ తెలిపారు.

విద్యుత్ సదస్సులో ఏడు ఫిర్యాదులు



వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో గురువారం టీఎస్ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ వేణుగోపాలచారి సమక్షంలో విద్యుత్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వాజేడు, వెంకటాపురం(కె) మండలాల నుంచి ఏడు ఫిర్యాదు అందగా.. అధికారులు ఒక ఫిర్యాదును తక్షణమే పరిష్కరించారు. మిగిలిన ఆరు ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్య క్రమంలో మెంబర్ ఆఫ్ ఫైనాన్స్ ఆర్ చరణ్, ఇండిపెండెంట్ మెంబర్ నరేందర్, ములుగు డీఈ నాగేశ్వరావు, వెంకటాపురం(కె) ఏడీఏ స్వామి, వాజేడు, వెంకటాపురం(కె) ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

విషజ్వరంతో వృద్ధురాలి మృతి


మంగపేట: మండలంలోని కమలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఒడిశా కాలనీకి చెందిన వృద్ధురాలు కొలిమి శాంత(70) విషజ్వరంతో వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధురాలు శాంత నాలుగు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయించారు. తగ్గకపోవడంతో ఏటూరునాగారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు రెండు రోజుల క్రితం ఎంజీఎంలో చేర్పించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. అయితే శాంతకు డెంగీ సోకినప్పటికీ సరైన వైద్యం అందకపోవడంతో మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఒడిశా కాలనీలో పారిశుద్ధ్యం, క్లోరినేషన్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.50వేలు స్వాధీనం



కన్నాయిగూడెం: మండలంలోని చెంతగూడెం వద్ద ప్రధాన రహదారిపై ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈక్రమంలో తుపాకులగూడెం, ఏటూరునాగారం నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేని రూ.50వేలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కాళేశ్వరంలో వనభోజనాలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామస్తులు గురువారం వనభోజనాలకు వెళ్లి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పలువురు గ్రామస్తులు కుటుంబసభ్యులతో కలిసి అటవీప్రాంతంలోకి వెళ్లి దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ముందస్తుగా మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తరువాత వాగులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. పిల్లపాపలు చల్లగా ఉండాలని వన దేవతలకు వేడుకున్నారు. కంకణాల బాపు, బండి శ్రీనివాస్, కొండ్ర రాజశేఖర్, అడప రమేష్, రాజబాపు, రాజయ్య ఉన్నారు.

పైరవీ పోస్టింగ్‌లపై వేలాడుతున్న కత్తి!



ఉమ్మడి వరంగల్‌లో వివాదాస్పద బదిలీలపై ఎన్నికల సంఘం ఆరా..

- పైరవీ పోస్టింగ్‌లు, నిబంధనల ఉల్లంఘనపై ఆగస్టులోనే నోటీసులు
- సంజాయిషీ ఇచ్చినా.. వదలని ఎన్నికల సంఘం
- చర్చనీయాంశంగా మారిన సీపీ రంగనాథ్ బదిలీ
- రెవెన్యూ, పోలీస్ అధికారుల్లో కలకలం
- గోప్యంగా సాగుతున్న విచారణ.. త్వరలోనే పలువురిపై వేటు?

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కి.. పైరవీలతో కోరుకున్నచోట పోస్టింగ్‌లు కొట్టిన రెవెన్యూ, పోలీస్ అధికారులపై బదిలీ కత్తి వేలాడుతోంది. వరంగల్, కరీంనగర్, రామగుండం కమిషనరేట్‌లతోపాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జగిత్యాల జిల్లాల్లో 51మంది పోలీస్ అధికారుల బదిలీల్లో ఎన్నికల నిబంధనలు పాటించలేదని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అత్యధికంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 21 మంది ఇన్‌స్పెక్టర్ నుంచి ఏసీపీల వరకు ఈ తరహా పోస్టింగ్‌లు పొందారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాస్తవాలను నివేదిక ద్వారా అందజేయాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి అవినాష్ కుమార్‌కు, సంబంధిత అధికారులకు లేఖ నం. 434/1/టీఈఎల్/ ఎస్ఓయు3/ 2023 ద్వారా రాశారు. వరంగల్ కమిషనర్‌తోపాటు మహబూబాబాద్, ములుగు ఎస్పీలు బదిలీల్లో నిబంధన ఉల్లంఘన లేదంటూ వివరాలు పంపారు. ఇది జరిగి సుమారు రెండు నెలలు కావస్తుండగా.. తాజాగా బుధవారం వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్, భూపాలపల్లి, మహబూబాబాద్ ఎస్పీలు పుల్లా కరుణాకర్, చంద్రమోహన్‌లపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. దీంతో నిబంధనలను నిబంధనలకు విరుద్ధంగా ఆరోపణలు ఎదుర్కొన్న పోలీసు, రెవెన్యూ అధికారులపైనా త్వరలోనే బదిలీ వేటు పడనుందన్న చర్చ జరుగుతోంది.

నిబంధనల ఉల్లంఘనపై ఈసీఐ ఆరా...

వరంగల్ సీపీ, భూపాలపల్లి, మహబూబాబాద్ ఎస్పీలపై బదిలీ వేటు వేసిన కేంద్ర ఎన్నికల సంఘం.. రెవెన్యూ, పోలీసుశాఖల్లో జరిగిన అన్ని బదిలీల్లో నిబంధనల ఉల్లంఘనపై ఆరా తీస్తోంది. ఎన్నికల నేపథ్యంలో పారదర్శకంగా బదిలీలు, పోస్టింగ్‌లు ఇవ్వాలని జూన్‌లోనే కమిషన్ సూచించింది. జిల్లాలు, కమిషనరేట్లలో పోలీస్ అధికారులకు సంబంధించి పలు మార్గదర్శకాలను పంపింది. అందుకు విరుద్ధంగా నాలుగేళ్లలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అనేక మంది తిరిగి జిల్లాలోనే పోస్టింగ్‌లు పొందారు. ఈ తరహాలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో 27 మంది పోస్టింగ్‌లు పొందినట్లు ఎన్నికల సంఘానికి లిఖితపూర్వమైన ఫిర్యాదులు అందాయి. రాజకీయ ఒత్తిళ్లు, ఎమ్మెల్యేల సిఫారసుల కారణంగా అడుగడుగునా ఉల్లంఘనలు జరిగాయంటూ వెల్లువెత్తిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణకు మరోసారి గురువారం ఎన్నికల సంఘం ఆదేశించడం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది.

'రెవెన్యూ'లోనూ ఇదే తంతు....

మరోవైపు రెవెన్యూలోనూ అదే పరిస్థితి నెలకొంది. హనుమకొండ ఆర్డీఓగా రెండున్నర సంవత్సరాలకు పైగా పని చేసిన వాసుచంద్రను ఎన్నికల సంఘం నిబంధనల పరిధిలోకి వస్తారని మొదట హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోకి వస్తాయి కూడా. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు బదిలీ చేసిన ఐదారు రోజులకే ఆయనను వరంగల్ జిల్లాలో ఆర్డీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని వెనుక ఓ కీలక ప్రజాప్రతినిధితోపాటు మరో ఇద్దరు నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధుల సిఫారసుల లేఖలు ఉన్నట్లు రెవెన్యూశాఖలోని కొందరు ఫిర్యాదు చేశారు. హనుమకొండ జిల్లాకు చెందిన చాలామంది తహసీల్దార్లు పొరుగు జిల్లా అయిన వరంగల్‌కు బదిలీ అయ్యారు. పలు నియోజకవర్గాలు రెండు జిల్లాల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు ఒక జిల్లాలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు ఇప్పుడు వరంగల్‌కు బదిలీ అయినా పాత నియోజకవర్గంలోకే మళ్లీ వచ్చారు. ఇలా జరిగిన చాలా బదిలీలు, పోస్టింగ్‌లపైనా ఎన్నికల సంఘం ఆరా తీస్తుండటం కలకలం రేపుతోంది.

- ఎనిమిదేళ్లుగా వరంగల్ జిల్లాలో పనిచేసి ఎస్‌బీ ఏసీపీ నుంచి అదే కమిషనరేట్ పరిధిలోని నర్సంపేటకు ఏసీపీగా పి.తిరుమల్ బదిలీ అయ్యారు. పరకాల ఏసీపీగా పోస్టింగ్ తీసుకున్న కిషోర్ ఏడేళ్లుగా ఇదే జిల్లాలో పనిచేస్తున్నారు. డేవిడ్‌రాజ్ కాజీపేట ఏసీపీగా నియమితులయ్యారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే జిల్లాలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన కేయూసీ తదితర పీఎస్‌లలో పని చేశారు. సి.సతీష్‌ను జూలై 15న మామునూరు ఏసీపీగా నియమించారు. గతంలో దుగ్గొండి సీఐతోపాటు ఆరేళ్ల పాటు వరంగల్ జిల్లాలో పని చేశారు. ఇది ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదులో ఉంది.
- మహబూబాబాద్ జిల్లాలో ఏడు సంవత్సరాలు పనిచేసిన ఎస్ఐ ఎస్‌కే యాసిన్, నాలుగేళ్లు పూర్తయిన శ్రీను నాయక్‌ను అదే జిల్లాలో కొనసాగిస్తున్నారు. క్రిమినల్ కేసులో భాగస్వామన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న రాణాప్రతాప్‌ను గూడూరు ఎస్ఐగా కూడా నియమించారు.
- ములుగు జిల్లా డీఎస్‌బీగా ఉన్న సట్ల కిరణ్, ఆర్ఐ కిరణ్, సీసీఎస్‌లో ఉన్న శివకుమార్‌లు దీర్ఘకాలికంగా అదే జిల్లాలో పనిచేసినా.. తిరిగి అక్కడే నియమించారన్న చర్చ ఉంది.

.. ఇలా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 21 మంది పోస్టింగ్‌లపై ఫిర్యాదులు ఉన్నాయి. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లాలో ముగ్గురు, ములుగు జిల్లాలో ముగ్గురి పోస్టింగ్‌లు వివాదాస్పదమయ్యాయి. అడుగడుగునా ఉల్లంఘనలు జరిగాయంటూ వెల్లువెత్తిన ఫిర్యాదుల నేపథ్యంలో వీరిపై ఎన్నికల సంఘం ఆరా తీస్తుండటం కలకలం రేపుతోంది.

జంగ్ తెలంగాణ

మీడియా ఎన్నికల కోడ్ పాటించాలి

ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు : ఎన్నికల కోడ్‌ను మీడియా తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ గౌష్ ఆలం, రిటర్నింగ్ అధికారి అంకిత్‌లతో కలిసి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన ఓటర్లు జాబితాలో పేరు సరిచూసుకోవాలని అన్నారు. జాబితాలో పేరు లేనివారు 31 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో 303 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఓటరుకు రెండు కిలోమీటర్ల రేడియస్ లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అవసరమైన మేర బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నసమయంలో మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయటం, తప్పుడు ప్రచారం చేయడంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ నాయకులు సమావేశాలు నిర్వహించేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు ఇస్తామని అన్నారు ముందస్తుగా ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదని అన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల సమీపంలో రాజకీయ సమావేశాలు నిర్వహించొద్దని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు సర్వేలెన్స్ బృందాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏఎంసీ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. 1950 టోల్‌ఫ్రీ నంబర్ లేదా.. సివిజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. యాప్‌లో ఫిర్యాదు అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల్లో అధికారులు క్షేత్రస్థాయిలోకి చేరుకొని ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటిగ్ ప్రెస్ ఫోన్ నంబర్ ప్రింట్ చేయమన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, ఇతర ప్రాంతాల్లో జరిగిన వీడియోలు ఇక్కడ జరిగినట్లు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా అడ్మిన్లు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. నగదు, లిక్కర్ అక్రమంగా సరఫరా చేయకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఎం కమిటీ సభ్యుడు శ్రీధర్, డీపీఆర్ఓ రఫీక్, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరగా పూర్తి చేయాలి



ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులతో కలెక్టర్, ఎస్పీ, అధికారులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ, ఎస్సీ కేసులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో దళిత అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ములుగు, ఏటూరునాగారం డివిజన్ల వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గడువులోగా కేసుల దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్ షీట్ వేసేలా చూడాలని అన్నారు. దర్యాప్తును పకడ్బందీగా చేపట్టి పూర్తి ఆధారాలను సేకరించాలని, నిర్ణీత గడువులోగా ఆధారాల సేకరణలో సమన్వయంగా పనిచేయాలని అన్నారు. ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆధారాల సేకరణలో ప్రతి టీం సమర్థవంతంగా విధులు నిర్వహిస్తుందని తెలిపారు. పోలీసు శాఖ తరఫున షీ టీంలు క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఎలాంటి వివక్షత లేకుండా కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీఓ అంకిత్‌తో కలిసి ఆయా శాఖలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని దృష్టిలో పెట్టుకొని నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో బ్యాలెట్‌బాక్స్ నిల్వ ప్రాంతాన్ని పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, రాజకీయ పార్టీ నాయకులు శశికాంత్, భాస్కర్‌రెడ్డి, రవీంద్రాచారి, ఎండీ చాంద్‌పాషా, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బొమ్మకంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షల్లో అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ములుగు: అక్టోబర్ 16 నుంచి 26 వరకు నిర్వహించనున్న టాస్(తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. జిల్లాలో 2పరీక్ష కేంద్రాల్లో 237 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను అనుమతించొద్దని అన్నారు. పరీక్ష పత్రాలును ఓపెన్ చేసే సమయంలో.. సీల్ చేసే సమయంలో సీసీ కెమెరాల్లో నమోదయ్యేలా చూడాలని చెప్పారు. ఇన్విజిలేటర్లకు ఒకరోజు ముందే సమావేశం నిర్వహించి సూచనలు చేయాలని తెలిపారు. ఆర్టీఈసీ బస్సులు పరీక్ష సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ పాణిని, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ అప్పి జయదేవ్, జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, ఏఎస్పీ సదానందం, డీసీఈబీ సహాయ కార్యదర్శి విక్రమ్ రాజ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌ల నియామకం

హన్మకొండ: బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఈ మేరకు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ గురువారం సాయంత్రం ప్రకటించారు. జనగామ నియోజకవర్గానికి ముగ్గురు ఇన్‌చార్జ్‌లను నియమించగా, మిగతా నియోజవర్గాలకు ఒక్కొక్కరిని నియమించారు. జనగామకు మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, రైతుబంధు చైర్మన్ తాటికొండ రాజయ్య, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును నియమించారు. మహబూబాబాద్‌కు రాష్ట్ర గిరిజన, మహిళ శిశు సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్, నర్సంపేటకు జలవనరుల మండలి చైర్మన్ వి.ప్రకాష్, వరంగల్ తూర్పునకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, భూపాలపల్లికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ములుగుకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని నియమించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

భూపాలపల్లి రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రేగూరి సుభాకర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పెండింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా సంఘం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి మినిమం టైమ్స్ వర్తింపజేస్తూ హెల్త్‌కార్డులు మంజూరు చేపిస్తామని తెలిపారు. పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అతి త్వరలోనే షెడ్యూల్ ప్రకారం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉమ్మడి జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, శంకర్, బిల్ల విజయ, బాసాని రజిత పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

ఎస్ఎస్ తాడ్వాయి : గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. గురువారం మండలంలోని మేడారం ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో డివిజన్ స్థాయి గిరిజన బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సరోజన అధ్యక్షతన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, డీడీ పోచం, ఏటీడీఓ దేసిరాం నాయక్ హాజరయ్యారు. ఈసందర్భంగా డీడీ పోచం మాట్లాడుతూ.. గిరిజన స్థాయి క్రీడా పోటీలు ఒక రోజులో పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. డిసెంబర్‌లో ఆశ్రమ పాఠశాలలో పలు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం క్రీడ నిర్వహణ అధికారి, పీజీ హెచ్ఎం కల్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. డివిజన్ స్థాయి క్రీడలకు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు విద్యార్థులకు ప్రోత్సాహంగా రూ.50వేల సాయం అందించారని తెలిపారు. మేడారం ఇంగ్లిష్ మీడియం పాఠశాలను 100 మంది నుంచి 600 మంది విద్యార్థుల స్థాయి వచ్చేలా సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. డీడీ పోచం కూడా జగ్గారావును అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డివిజన్ స్థాయి 14–17సంవత్సరాల క్రీడల ఎంపిక పోటీలకు నాలుగు మండలాల్లోని 16 ఆశ్రమ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి యాలం ఆదినారాయణ, సమ్మక్క పూజారి సిద్దబోయిన స్వామి, డిప్యూటీ వార్డెన్ ఆశ్విని, పీడీ గడ్డం లక్ష్మీనారాయణ, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

ఏటూరునాగారం: గిరిజన విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించాలని ఐటీడీఏ డీడీ పోచం అన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలలో 14, 17 సంవత్సరాల బాలికలలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ఏటూరునాగారం డివిజన్ స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా పోచం మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహదపడతాయని అన్నారు. గిరిజన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఏసీఎంఓ కోడి రవీందర్, హెచ్ఎం రేవతి, సారంగపాణి, పీడీ, పీటీలు తదితరులు పాల్గొన్నారు.



ఖోఖోలో విజేత మేడారం ఇంగ్లిష్ మీడియం పాఠశాల జట్టుకు బహుమతి అందజేస్తున్న అతిథులు

ముందస్తు సంబురం

జిల్లా వ్యాప్తంగా గురువారం విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయినులు వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను పాఠశాలలు, కళాశాలల ఆవరణలో ఉంచి పాటలు పాడుతూ.. నృత్యాలు, కోలాటాలు ఆడుతూ.. ఆనందంగా గడిపారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.



వెంకటాపురం(కె): బతుకమ్మలతో విద్యార్థినులు

క్లుప్తంగా

ద్విచక్రవాహనం నుంచి నగదు చోరీ

డోర్నకల్: ద్విచక్రవాహనంలో భద్రపరిచిన నగదును ఓ దుండగుడు చోరీ చేశాడు. ఈ ఘటన గురువారం మండల కేంద్రంలో జరిగింది. మండలంలోని పెరుమాళ్లసంకీసకు చెందిన వీరబాబు స్థానిక బ్యాంకులో రూ.90 వేలు డ్రా చేసి ద్విచక్రవాహనం ట్యాంక్ కవర్‌లో భద్రపరిచి ఇంటికి బయలుదేరారు. బైపాస్‌లో బంక్‌కు వెళ్లి వాహనంలో పెట్రోల్ పోయించుకుని బయలుదేరుతున్నారు. ఈ క్రమంలో ఫోన్ రావడంతో వాహనాన్ని బంక్ ఆవరణలో నిలిపి మాట్లాడుతుండగా ఓ దుండగుడు ట్యాంక్ కవర్ నుంచి నగదును చోరీ చేశాడు. దీంతో బాధితుడు లబోదిబోమన్నాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు తెలిపారు.

వ్యాపారి ఖాతా నుంచి నగదు మాయం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన ఓ వ్యాపారి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు బుధవారం రూ. 40 వేల నగదును మాయం చేశారు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు వెంటనే కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు వ్యాపారి స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నాడు. ఫోన్‌లో ఎలాంటి యాప్‌లు ఉపయోగించనప్పటికీ రూ. 40 వేలు ఖాతా నుంచి డ్రా అయినట్లు సమాచారం రావడంతో ఖంగుతిన్నారు. వెంటనే సంబంధిత బ్యాంకులో ఖాతాను బ్లాక్ చేయించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సారెస్పీలో మృతదేహం లభ్యం


గుర్తుతెలియని మహిళ మృతదేహం

రామన్నపేట : వరంగల్ డాక్టర్స్ కాలనీ బ్రిడ్జి వద్ద ఎస్సారెస్పీలో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతురాలి వయసు 26 సంవత్సరాలు ఉంటుందని, చామన్ ఛాయ రంగులో ఉండి పంజాబీ డ్రెస్ ధరించిందన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 8712685005, 8712685090 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హ్యాపీ జర్నీ..

బతుకమ్మ, దసరాకు ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళిక
- వరంగల్ రీజియన్‌లో 800 ప్రత్యేక బస్ సర్వీస్‌లు
- నేటి నుంచి ప్రయాణికుల సేవలోకి..
- లక్కీ డ్రా ద్వారా బహుమతులు



హన్మకొండ: తెలంగాణలో పెద్ద పండుగలు బతుకమ్మ, దసరా. ఈ పండుగల కోసం దేశంలో ఏ ప్రాంతంలో ఉన్నా తప్పనిసరిగా స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా.. వారు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునేలా టీఎస్ ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ప్రత్యేక బస్ సర్వీస్‌లు ఏర్పాటు చేసి మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు సర్వం సిద్ధమైంది. వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోల పరిధిలో కార్యాచరణ రూపొందించుకుంది. ఇందులో భాగంగా ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా బస్ సర్వీస్‌లు నడిపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రూట్‌ల వారీగా ప్రయాణికుల రద్దీని అంచనా వేశారు. ఈ మేరకు అదనపు బస్ సర్వీస్ నడిపే రూట్లను గుర్తించారు.

హైదరాబాద్ రూట్‌లో అధిక రద్దీ..

ప్రధానంగా హైదరాబాద్ రూట్‌లో రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేసి ఈ మేరకు డిపోలు, రూట్‌ల వారీగా ప్రత్యేక బస్ సర్వీస్‌లు నడపాలని నిర్ణయించారు. ఈ నెల 13 నుంచి పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో అదే రోజు నుంచి అవసరమైన రూట్‌లలో అదనపు బస్ సర్వీస్‌లు నడపాలని నిర్ణయించారు. బతుకమ్మ, దసరాకు ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో మొత్తం 800 ప్రత్యేక బస్ సర్వీస్‌లు నడపనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 13న 100 అదనపు బస్ సర్వీస్‌లు నడపాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీ వరకు ప్రత్యేక బస్ సర్వీస్‌లు రోజు వారీగా నడిపేలా ప్రణాళిక ఖరారు చేశారు. ఈ ప్రత్యేక బస్ సర్వీస్‌లన్నీ హనుమకొండ–హైదరాబాద్‌లోని ఉప్పల్ మధ్యలో నడపనున్నారు. వీటికి అదనంగా ఇతర రూట్లలో మరి కొన్ని నడుపనున్నారు. 14వ తేదీన 90 బస్ సర్వీస్‌లు, 15న 60, 19న 60, 20న 130, 22న 100, 23న 100, 24వ తేదీన 30 అదనపు బస్ సర్వీస్‌లు నడపనున్నారు.

ప్రత్యేక వ్యూహంతో ముందుకు..

పండుగ సందర్భంగా అధిక ఆదాయం రాబట్టుకునేలా ఆర్టీసీ ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది. బతుకమ్మ, దసరా.. ఆర్టీసీకి ఆదాయాన్ని సమకూర్చే పండుగలు కావడంతో ప్రయాణికులను వీలైనంత మేరకు ఆర్టీసీ బస్ సర్వీస్‌ల్లో ప్రయాణించేలా, ఆర్టీసీ వైపు ఆకర్షించేలా ప్రత్యేక స్కీమ్‌లను ప్రవేశపెట్టింది. దీంతో పాటు ఆర్టీసీ ప్రయాణం సురక్షితం, క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చనే ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తోంది. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రయాణికులకు సేవలు అందించడంతో పాటు, అధిక ఆదాయం రాబట్టుకునేలా ఆర్టీసీ ముందుకెళ్తోంది.

లక్కీ డ్రా ద్వారా బహుమతులు ..

ప్రయాణికులను ఆకర్షించేందుకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించాలని నిర్ణయించింది. బతుకమ్మ, దసరా పండుగకు ఆర్టీసీ బస్ సర్వీస్‌ల్లో ప్రయాణించే వారికి బహుమతులు అందించనున్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు, మళ్లీ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్ సర్వీస్‌ల్లో ప్రయాణించే ప్రయాణికులు లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. ఈ రోజుల్లో ఆర్టీసీ బస్ సర్వీస్‌ల్లో ప్రయాణించిన వారు టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌ల్లో వేయాలి. సెప్టెంబర్ మాసంలో డ్రా తీసీ విజేతలకు బహుమతులు అందించనున్నారు.

డిపోల వారీగా ప్రత్యేక బస్ సర్వీస్‌లు..

వరంగల్–1 డిపో 124 ప్రత్యేక బస్సులు, వరంగల్–2 డిపో 124, హనుమకొండ డిపో 124, పరకాల డిపో 88, నర్సంపేట డిపో 103, జనగామ డిపో 99, తొర్రూరు డిపో 46, మహబూబాబాద్ డిపో 46, భూపాలపల్లి డిపో 46 ప్రత్యేక బస్ సర్వీస్‌లు నడిపేలా ప్రణాళిక రూపొందించారు.

అవసరం మేరకు మరిన్ని బస్ సర్వీస్‌లు



ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక బస్ సర్వీస్‌లు నడుపుతున్నాం. బతుకమ్మ, దసరా పండుగకు ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. వారికి ఇబ్బంది కలగొద్దనే ఉద్దేశంతోనే అదనపు బస్ సర్వీస్‌లు నడుపుతున్నాం. అధికారులు బస్టాండ్లలో ఉండి ప్రయాణికుల రద్దీ ఏ రూట్‌లో ఉంటే ఆ రూట్‌లో అప్పటికప్పుడు అదనపు బస్ సర్వీస్‌లను సమకూర్చి పంపిస్తారు. ఈ మేరకు అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రధాన రూట్లలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాం.

జె.శ్రీలత, ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్

నాడు విప్లవం..నేడు ప్రజాక్షేత్రంలో..

- కాంగ్రెస్‌లో చేరిన మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్
- 25 ఏళ్లపాటు ఉద్యమంలో సేవలు
- 2016లో లొంగుబాటు తర్వాత సాధారణ జీవితం
- పరకాల నుంచి పోటీకి సై..


గాజర్ల అశోక్ అలియాస్ ఐతు

పరకాల / టేకుమట్ల: తాడిత, పీడిత ప్రజల కోసం 25 ఏళ్ల పాటు విప్లవోద్యమంలో పనిచేసి అనారోగ్యం కారణంగా పోలీసులకు లొంగిపోయిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతు.. రాజకీయ క్షేత్రంలోకి అడుగుపెట్టారు. గురువారం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనవెంట పరకాల, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు పలువురు ఉన్నారు. పరకాల నియోజకవర్గంనుంచి టికెట్ ఆశిస్తున్న ఆయన.. పార్టీ పెద్దల స్పష్టమైన హామీతోనే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. కాగా, ఆయన చేరికతో పరకాల, భూపాలపల్లి, నర్సంపేట, మంథని నియోజకవర్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది.

బుల్లెట్ వదిలి బ్యాలెట్ వైపు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల కనుకమ్మ–మల్లయ్య దంపతులకు ఐదుగురు కుమారులు రాజయ్య, సమ్మయ్య, సారయ్య, రవి, అశోక్ ఉన్నారు. మూడో కుమారుడు సారయ్య అలియాస్ భాస్కరన్న, ఆజాద్ 1987లో సింగిల్ విండో ఎన్నికల్లో డైరెక్టర్‌గా పోటీచేసి పెత్తందారుల వల్ల ఓటమి పాలయ్యారు. పెత్తందార్ వ్యవస్థను రూపుమాపాలనే లక్ష్యంతో పోరుబాట వైపు అడుగులు వేసి 1989లో పీపుల్స్ వార్‌లో చేరారు. అన్న బాటలోనే తమ్ముళ్లు సారయ్య, రవి, అశోక్ ఉద్యమంలో చేరారు. సారయ్య, రవి ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా, అనారోగ్యంతో అశోక్ 2016లో పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. అప్పటినుంచి స్థానికంగా సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉద్యమంలో ప్రజలకు సేవ చేసినట్లుగానే రాజకీయంగా పూర్తిస్థాయిలోకి రావాలనే ఉద్దేశంతో వచ్చే ఎన్నికల్లో తన భాగస్వామ్యం ఉండాలని కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కొందరు చెబుతున్నారు.

ఉద్యమాల గడ్డ పరకాల నుంచి గాజర్ల ..?

నిజాం పాలకుల నుంచి విముక్తి కోసం రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగిన ప్రాంతం నుంచి అనూహ్యంగా మాజీ మావోయిస్టు గాజర్ల అశోక్ కాంగ్రెస్ అభ్యర్థిగా కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆసక్తిగా మారింది. పరకాల స్థానం నుంచి ఇప్పటికే కొండా మురళీధర్‌రావు, ఇనగాల వెంకట్రామిరెడ్డి టికెట్ కోసం దరఖాస్తు చేసి పార్టీ పెద్దలను ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు అశోక్ చేరడంతో పరకాల కాంగ్రెస్ రాజకీయం ట్రయాంగిల్‌గా మారింది. చివరికి ఎవరికి టికెట్ వస్తుందో వేచి చూడాల్సిందే..

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వరదారెడ్డి

హసన్‌పర్తి : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ. వరదారెడ్డి అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎ. వరదారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక మార్పుల కనుగుణంగా విద్యార్థులు తమనైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ డ్రోన్లు, రోబోటిక్‌ల వినియోగం వల్ల వ్యవసాయ రంగం మెరుగైన ఫలితాలు సాధిస్తోందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జి. భూపాల్‌రాజ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశముందని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్కిల్, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గించి మరమ్మతులు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు డిపార్ట్‌మెంట్ వాహనాల్లో చేపట్టాలన్నారు. రెండు సంవత్సరాల పైబడిన వర్క్ ఆర్డర్‌లన్నీ పూర్తి చేయాలన్నారు. దత్తత గ్రామాల్లోని అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. గిరివికాసంలో నమోదు చేసుకున్న సర్వీసులను వెంటనే మంజూరు చేయాలన్నారు. వినియోగదారుల మొబైల్ నంబర్లు తీసుకుని వారి సర్వీసు కనెక్షన్లతో అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు బి.వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు, జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఇద్దరి ఆత్మహత్య

- వెంకటాపూర్, ఎల్‌బీ నగర్‌లో ఘటనలు
- శోకసంద్రంలో ఆయా కుటుంబాలు


సతీష్(ఫైల్)

దామెర: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండలంలోని వెంకటాపూర్‌లో జరిగింది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి సతీష్(36) దామెర తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి సతీష్ భార్య లిఖితకు, తల్లి లక్ష్మికి గొడవ జరిగింది. దీంతో ఇద్దరిని సముదాయించి సతీష్ తన కూతురుతో ఒక గదిలో నిద్రించేందుకు వెళ్లాడు. ఇంట్లో జరిగిన గొడవను తలుచుకుంటూ మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూతురు ఉదయం లేచి చూసి కేకలు వేయగా బంధువులు వచ్చి చూసేసరికి సతీష్ అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

ఇటీవలే ఉద్యోగ భద్రత పొందిన సతీష్..

సతీష్.. ఏపీపీఎస్సీ ద్వారా 2012లో వీఆర్ఏగా ఎంపికై ఉమ్మడి ఆత్మకూరు, దామెర మండలాల తహసీల్ కార్యాలయంలో 11 సంవత్సరాలు విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 10, 2023న వీఆర్ఏలకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించగా, సతీష్ దామెర తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోరాడి సాధించుకున్న ఉద్యోగంలో చేరి 2 నెలలు గడవకముందే సతీష్ మృతి చెందడం పలువురిని కలిచివేసింది. దామెర, గీసుకొండ, నడికూడ తహసీల్దార్లు జ్యోతివరలక్ష్మీదేవి, రియాజుద్దీన్, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు.. సతీష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగర్త చెరువులో దూకి వ్యక్తి..

ఖిలా వరంగల్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. అగర్త చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన రామ అశోక్(38)కు కరీమాబాద్‌కు చెందిన దివ్యతో పదిహేను ఏళ్ల క్రితం వివాహమైంది. అశోక్ నగరంలోని ఓ ప్రముఖ బట్టల షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో దంపతుల మధ్య గొడవలు జరిగాయి. దీంతో పదినెలల క్రితం భర్తను వదిలేసిన దివ్య.. తన పుట్టింటికి వెళ్లి అక్కడే డెలివరీ అయింది. అశోక్ తన భార్య, బిడ్డను పుట్టింటి నుంచి తీసుకొచ్చేందుకు ఎంత ప్రయత్నించిన ఫలించలేదు. దీంతో మనస్తాపం చెందిన అశోక్ బుధవారం రాత్రి ఖిలావరంగల్‌లోని రాతికోటపైకి చేరుకుని అగర్త చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం వాకింగ్ వచ్చిన వారు రాతి కోటపైకి చేరుకోగా అశోక్ చెప్పులు, పర్సు లభించింది. ఈ విషయాన్ని వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు తెలిపారు. వారు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. అనంతరం వరంగల్ డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించగా వారు మరబోట్ల సాయంతో చెరువులో గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోలీసులు మృతుడి వివరాలను సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి తెలిపారు.

సిక్కిం గవర్నర్‌ను కలిసిన యశ్వంత్


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్ : సిక్కిం రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటెయినర్ భూక్య యశ్వంత్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. యశ్వంత్ ఇటీవల బేస్ క్యాంపు పూర్తి చేసి ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సిక్కిం రాష్ట్ర గవర్నర్ పిలుపు మేరకు యశ్వంత్ ఆ రాష్ట్ర రాజ్ భవన్‌లో ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. గతంలో అధిరోహించిన పర్వతాల గురించి యశ్వంత్‌ను ఈ సందర్భంగా గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని యశ్వంత్‌కు సూచించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి


రోహిత్(ఫైల్)

వాజేడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన విద్యార్థి చిడెం పెళ్లి రోహిత్ (12) మృతి చెందాడు. మండలంలోని మండపాక వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 8వ తేదీన రోహిత్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో రోహిత్‌ను తల్లిదండ్రులు వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా, రోహిత్ వాజేడు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు.

ఎండు గంజాయి పట్టివేత

జనగామ రూరల్: పట్టణంలోని అండర్ బ్రిడ్జి బాణాపురం రోడ్డులో గురువారం సాయంత్రం పోలీసులు ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బాణాపురానికి చెందిన గణేష్ ద్విచ్రవాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా తన బైక్‌లో గంజాయి ఉందని తెలిపాడు. రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి తాను గంజాయిని కొనుగోలు చేశానని, దీని విలువ సుమారు రూ. 25వేలు ఉంటుందని పోలీసులకు వివరించాడు. దీంతో గణేష్ అదుపులోకి తీసుకుని జనగామ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

నల్లబెల్లం స్వాధీనం



రామన్నపేట : వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం గుడుంబా తయారీకి ఉపయోగించే రూ. 40 వేల విలువైన 5 క్వింటాళ్ల నల్ల బెలాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోతన క్రాస్ వద్ద మహబూబాబాద్‌కు చెందిన బానోతు రంగి నుంచి ఈ బెల్లం స్వాధీనం చేసుకున్నారు. అలాగే, రూ. 18 వందల విలువైన 18 కిలోల పటిక కూడా స్వాధీనం చేసున్నట్లు పేర్కొన్నారు. కాగా, నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్న సీఐ బాబులాల్, ఎస్సై వంశీకృష్ణ, టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏసీపీ మధుసూదన్ అభినందించారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు..

పెద్దవంగర : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో డ్రైవర్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండలంలోని కిష్టు తండాకు చెందిన జాటోతు జేత్రాం (53) బుధవారం సాయంత్రం తన పాడి గేదెలను పొలం నుంచి ఇంటికి తోలుకొస్తున్నాడు. ఈ క్రమంలో తొర్రూరు డిపోకు చెందిన ఏపీ 29 జెడ్ 1783 నంబర్ గల ఆర్టీసీ బస్సు తిర్మలగిరి నుంచి తొర్రూరు వస్తూ కిష్టుతండా సమీపంలో జేత్రాంతో పాటు గేదెలను ఢీకొంది. దీంతో జేత్రాం మృతి చెందాడు. అలాగే, రెండు గేదెలు కూడా మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనకు కారణమైన డ్రైవర్ కాటమల్ల సాయిలుపై మృతుడి భార్య భద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుండ్లసింగారంలో కాల్పుల కలకలం

- ఆర్థిక లావాదేవీలతో అత్తను రివాల్వర్‌తో కాల్చిన అల్లుడు
- రామగుండం కమిషనరేట్‌లో రైటర్‌గా పనిచేస్తున్న నిందితుడు
- భార్య, బావమరిదితోపాటు అత్త టార్గెట్?
- ఆ సమయంలో ఇంట్లో బావమరిది లేకపోవడంతో సేఫ్
- ఘటనా స్థలాన్ని సందర్శించిన డీసీపీ


కమలాదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, రక్తంతో కానిస్టేబుల్ ప్రసాద్, రోదిస్తున్న మృతురాలి కూతురు రమాదేవి, వివరాలు సేకరిస్తున్న డీసీపీ

హసన్‌పర్తి: గ్రేటర్ వరంగల్ పరిధిలోని రెండో డివిజన్ గుండ్లసింగారంలో గురువారం కాల్పులు కలకలం రేపాయి. అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇవ్వనందుకు ఓ కానిస్టేబుల్ (రైటర్) పోలీస్ సర్వీస్ రివాల్వర్‌తో అత్తపై కాల్పులు జరపడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఒక్కసారిగా తూటా శబ్దంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

రివాల్వర్ ఎత్తుకొచ్చాడు...

నగరంలోని కీర్తినగర్‌కు చెందిన అడ్డె ప్రసాద్‌కు గుండ్లసింగారానికి చెందిన రమాదేవితో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. ప్రసాద్‌తోపాటు అత్త కుటుంబసభ్యులు గుండ్లసింగారంలో వేర్వేరు ఇళ్ల అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ప్రసాద్ రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్(రైటర్)గా విధులు నిర్వహిస్తున్నాడు. నెలకోమారు, రెండు సార్లు ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. కొంతకాలం క్రితం ప్రసాద్ తన అత్త కమలాదేవి(58)కు రూ.4లక్షల అప్పుగా ఇవ్వగా తిరిగి ఆమె ఇవ్వలేదు. దీంతోపాటు అతడి కాపురంలోనూ విభేదాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వారిపై కోపం పెంచుకున్న ప్రసాద్ అత్తతోపాటు భార్య, బావమరిది టార్గెట్ చేశాడు. మొదట అత్తను చంపి ఆ తరువాత ఇంట్లోనే ఉన్న బావమరిదిని.. అనంతరం తన ఇంటికి వెళ్లి భార్యను తుదముట్టించాలనుకున్నాడు. వరుసగా ముగ్గురిని చంపాలంటే తుపాకీ అవసరమని భావించాడు. బుధవారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ తన రివాల్వర్‌ని క్లీన్‌చేసి భద్రపర్చమని ప్రసాద్‌కు చెప్పాడు. కానీ ప్రసాద్ ఆ రివాల్వర్‌ను భద్రపరిచి ఆ తరువాత ఎవరికీ తెలియకుండా తీసుకున్నాడు. అనంతరం గుండ్లసింగారం వచ్చాడు. గురువారం ఉదయం స్టేషన్‌కు వచ్చిన స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రివాల్వర్ తీసుకునేందుకు వెళ్లగా కనిపించలేదు. దీంతో స్టేషన్‌లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. రివాల్వర్‌ను ప్రసాద్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆ తరువాత అక్కడి పోలీసులు ప్రసాద్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదని సమాచారం. కోటపల్లినుంచి గురువారం ఉదయం గుండ్లసింగారం చేరుకున్న ప్రసాద్ నేరుగా అత్త కమలాదేవి ఇంటికి వచ్చి ఆమెను కాల్చాడు. అప్పటికే స్థానికులు గుమిగూడడంతోపాటు కుటుంబ సభ్యులు రావడం.. అతనిపై దాడి చేయడంతో ముందుగా అనుకున్న ప్లాన్ వర్కవుట్ కాలేదని తెలుస్తోంది.

తూటా శబ్దంతో కలకలం

కమలాదేవిపై రివాల్వర్‌తో ఒక రౌండ్ కాల్పులు జరపడంతో ఆమె ఇంటినుంచి రోడ్డుమీదికి రక్తమోడుతూ వచ్చి కింద పడింది. రక్తం కూడా గేటునుంచి పది అడుగుల దూరం పడి ఉంది. ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో ఇరుగుపొరుగు వారు ఆందోళనకు గురయ్యారు. కొద్దిదూరంలో ఉన్న ప్రసాద్‌భార్య రమాదేవితోపాటు ఆమె కూతుళ్లు, సోదరుడు హుటాహుటిన వచ్చి చూసేసరికి తల్లి చనిపోయి కనిపించడంతో బోరున విలపించారు. ఓవైపు తల్లి మృతదేహం..మరో వైపు ప్రసాద్ దర్జాగా కుర్చీలో కూర్చొని ఉండడంతో ఆగ్రహానికి గురయ్యారు. అతనిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో అతని తల, శరీరంపై తీవ్ర గాయాలై రక్తంతో తడిసిపోయాడు.

ఆధారాల సేకరణ..

సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఏ బారి, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై ఇరుగుపొరుగు వారిని, కమలాదేవి కూతురు రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. రక్తనమూనాలు సేకరించారు. కాల్చిన బుల్లెట్ షెల్ కోసం పోలీసులు గాలించారు. దాదాపు గంటరన్న పాటు వెతికారు. అయినప్పటికీ లభ్యం కాలేదు.

కొంతకాలంగా వేర్వేరుగా..

కొంతకాలంగా ప్రసాద్, రమాదేవి మధ్య కుటుంబ కలహాలు నెలకొన్నాయి. దీంతో దూరంగానే ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం తనను వేధింపులకు గురి చేస్తున్నాడని రమాదేవి నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. ఈ విషయాన్ని ప్రసాద్ అవమానకరకంగా భావించినట్లు చర్చ జరుగుతోంది. దీనంతటికి భార్యతోపాటు అత్త, బావమరిది కారణమని కోపం పెంచుకున్న అతను ఈ ఘాతుకానికి పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

సమగ్ర దర్యాప్తు : ఎంఏ బారి, డీసీపీ

హత్యపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి తెలిపారు. ఈ హత్యకు ఆర్థిక, ఇతరత్రా కారణాలు ఉన్నాయనే అంశంపై విచారణ చేపడతామన్నారు. గుండ్లసింగారంతోపాటు కీర్తినగర్‌లోని నిందితుడి ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం నిందితుడి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. మృతురాలి కూతురు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.